సాక్షి
వికారాబాద్
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



పదేళ్లుగా పట్టించుకోవట్లే..!
మోమిన్‌పేట మండలం ఎన్కేపల్లికి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారి పదేళ్లవుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదు. 8లో▸



కేంద్రం నిధులతోనే పనులు
కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని సినీనటి జీవితారాజశేఖర్ విమర్శించారు. 8లో▸



మినీస్టేడియం కలేనా?
దౌల్తాబాద్‌లో మినీస్టేడియం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. సరైన క్రీడా మైదానం లేక ఇబ్బందులకు గురువుతున్నారు. 9లో▸

ఖాకీ మాయ.. రియల్ మాఫియా!



పోలీసుల చుట్టూ భూ వివాదాలు
- రాజకీయాల్లోనూ జోక్యం
- పోలీస్‌స్టేషన్లలోనే సివిల్ తగాదాల పరిష్కారం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు

సివిల్ వివాదాలు.. రియల్ దందాలే పోలీసుల విధులుగా మారాయి.. ఇటీవల పలు వివాదాల్లో పోలీసులు చిక్కుకుంటుండటమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో ఈ సంస్కృతి బాగా పెరిగిపోయింది. 'ఇచ్చట భూ వివాదాలు, సివిల్ కేసులు పరిష్కరించబడవు' అని పోలీస్‌స్టేషన్ల ఎదుట రాస్తున్న రాతలు బోర్డులకే పరిమితమవుతున్నాయి. జిల్లాలో ఏ పోలీస్‌స్టేషన్‌లో చూసినా సివిల్ వివాదాలే కనిపిస్తున్నాయి. పోలీస్ స్టేషన్లలోనే కూర్చోబెట్టి పంచాయితీలు చేస్తుండటం గమనార్హం. కొన్ని చోట్ల రియల్టర్లకు మద్దతుగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వికారాబాద్: పోలీసులు రియల్ వ్యాపారంలో భాగస్వాములు అవుతుండటంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. రాజకీయ పార్టీల విషయంలోనూ ఒకరికి అనుకూలంగా ఇంకొకరికి వ్యతిరేకంగా పోలీసులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. కానిస్టేబుల్ మొదలుకుని ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీల వరకు భూ వివాదాలు, రియల్ ఎస్టేట్ వ్యాపార సంబంధ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో టీచర్ల జోక్యం ఎక్కువ అవుతోందనే ఆరోపణలు గతంలో వినిపించేవి. ప్రస్తుతం పోలీసుల పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే టాస్క్‌ఫోర్స్ దాడులతో పాటు వారు వ్యవహరిస్తున్న తీరు సైతం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవలి కాలంలో జిల్లాలో టాస్క్‌ఫోర్స్ దాడులు పెరగగా వారి వ్యవహార శైలిపై విమర్శలు ఎక్కువయ్యాయి. టీ పొడి, అల్లం పేస్టు తదితర కల్తీ ఆహార పదార్థాలు ఇటీవల చాలా చోట్లా పట్టుకున్నారు. ఈ సమయంలో క్వింటాళ్ల కొద్దీ టీ పౌడర్ లాంటివి సరఫరా చేసే బడా మోసకారులను పక్కన పెట్టి వారి దగ్గర కొనుగోలు చేసే అమయాకులైన టీ హోటల్ నిర్వహకులపై కేసులు పెడుతుండటం శోచనీయం. ఇందులో పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నందనే అసలు వ్యక్తుల జోలికి వెళ్లడం లేదనే ప్రచారంసాగుతోంది.

వివాదాలు మచ్చుకుకొన్ని..
- ఆరు నెలల క్రితం ఎస్పీ కార్యాలయంలో పని చేసే ఓ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కిన ఘటనపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. ఆ ఘటన తరువాత ఉన్నతాధికారుల దిద్దుబాటు చర్యలతో కొద్ది రోజులు పోలీసులు వివాదాలకు దూరంగా ఉన్నట్టు కనిపించింది.
- మళ్లీ పోలీసులు వివాదాల్లో చిక్కుకోవటం ప్రారంభమయ్యింది. ఇటీవల కొడంగల్ మండలంలో జరిగిన ఓ భూ వివాదంలో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా అతడిపైనే కేసు నమోదు చేశారు. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించగా ఎస్‌ఐపై కేసు నమోదు చేసి డీఎస్పీ విచారణ జరిపారు.
- గత వారం తాండూరులో జరిగిన ఓ వివాదంలో పోలీసులు ఎమ్మెల్యే మెప్పుకోసం కేసులు నమోదు చేసి హింసిస్తున్నారంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ హోంశాఖ మంత్రి మహమూద్ అలీని కలిసి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశం అయ్యింది.
- నెల రోజుల క్రితం చన్గోముల్ ఎస్‌ఐ ఒకేసారి రెండు మూడు భూ వివాదాల్లో తలదూర్చినట్టు వార్తలొచ్చాయి. దీంతో ఆయన ఉన్నతాధికారులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా డ్యూటీ వదిలేసి వెళ్లిపోయారు. తరువాత దాన్ని సిక్ లీవ్‌గా మార్చుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో ఓ డివిజన్ స్థాయి అధికారి పాత్ర కూడా ఉందని ఆరోపణలు వినిపించాయి. ఆయన ఇప్పటి వరకు డ్యూటీలో జాయిన్ కాలేదు.
- నెల రోజుల క్రితం తాండూరులో ఓ హెడ్ కానిస్టేబుల్ ఓ వివాదంలో చిక్కుకోగా ఆయనపై సైతం కేసు నమోదయ్యింది.
- తాజాగా దోమ ఎస్‌ఐ సైతం ఓ భూమి కొనుగోలు వ్యవహారంలో ఓ వ్యక్తిని దుర్భాషలాడిన ఆడియో వైరల్ కావడం సర్వత్రా జోరుగా చర్చ జరుగుతోంది.

మారాలి.. మార్పు తేవాలి



ప్రాథమిక పాఠశాలలో నీళ్లలా ఉన్న పప్పును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- విధుల పట్ల నిర్లక్ష్యం తగదు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- కుల్కచర్ల మండలంలో విస్తృత పర్యటన
- విధులు నిర్వహించని అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్
- పర్యవేక్షణ పట్టని ప్రధానోపాధ్యాయురాలికి మెమో

కుల్కచర్ల: ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణ రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని పీరంపల్లిలో కలెక్టర్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు శ్రద్ధతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధిపథంలో దూసుకుపోతాయని అన్నారు.ఏ శాఖ అధికారి అయినా విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు కలెక్టర్..గ్రామ పరిధిలో నూతనంగా వేసిన సీసీరోడ్డును పరిశీలించారు.అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం, తదితర అంశాలపై ఆరాతీశారు. అయితే అంగన్‌వాడీ టీచర్ తమకు ఎటువంటి పౌష్టికాహార సరుకులు ఇవ్వడంలేదని గర్భిణులు తెలిపారు. పైగా ఆమె స్థానంలో ఇతరుల చేత పని చేయిస్తున్నదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కలెక్టర్ స్పందించి ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతగా లేకపోవడంతో పాటు, పప్పు నీళ్లచారులా ఉందని, పర్యవేక్షణ చేయని ప్రధానోపాధ్యాయురాలికి మెమో జారీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంలో రాజీపడవద్దని భోజన కార్మికులకు సూచించారు. అనంతరం డంపింగ్ యార్డును, నర్సరీని పరిశీలించి నిర్వహణ సరిగ్గా లేదని 15రోజుల్లో మార్పును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు బంధు అధ్యక్షుడు రాజు,ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఖరీం, స్థానిక సర్పంచ్ రాధికసోమలింగం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



పీరంపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

న్యూస్‌రీల్

వంతెన పూర్తయ్యే.. పయనం సులువయ్యే



కొడంగల్: మండల పరిధిలోని పోషమ్మ, మైసమ్మ కుంట తండాల మధ్య నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తయ్యాయి. త్వరలో వినియోగంలోకి వస్తుందని టీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఈ రెండు తండాల మధ్య వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. తండాల మధ్య వాగు ఉంది. అధిక వర్షాలు కురిస్తే వాగులో వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. మైసమ్మ కుంట తండా వాసులు వర్షాకాలంలో కొడంగల్‌కు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు వంతెన నిర్మాణం పూర్తి కావడంతో సమస్య పరిష్కారం అయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి

తాండూరు రూరల్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ సంఘం అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చెంగోల్, జినుగుర్తి, మల్కాపూర్, కరన్‌కోట్, బెల్కటూర్ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ పీఆర్‌టీయూ తరపున అనేక సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 73 వేల సభ్యత్వం ఉన్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ అని అన్నారు. ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మయ్య, పురుషోత్తంరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, నాగప్ప, కిష్టప్ప, నర్సిరెడ్డి, రమేష్, రాంనర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణపై అశ్రద్ధ తగదు



ద్యాచారం గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

అనంతగిరి: నర్సరీల్లో మొక్కల సంరక్షణపై అశ్రద్ధ తగదని, ప్రతి మొక్క ఏపుగా పెరిగేలా చూడాలని జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ మండలం ద్యాచారంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పల్లె ప్రగతి, ప్రకృతి వనం, ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, శ్మశాన వాటిక, ఎస్‌డబ్ల్యూఎంషెడ్లు, శానిటేషన్, అంగన్‌వాడీ సెంటర్ తదితర వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలన్నీ పచ్చగా మారాలన్నారు. నర్సరీలో టార్గెట్ మేరకు మొక్కలన్నీ బతికేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీ ఓ తరుణ్ కుమార్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి పుష్ప, ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్ పాల్గొన్నారు.

తాండూరులో బీఎస్పీ జెండా ఎగరేస్తాం

పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్

తాండూరు టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో బహుజన సమాజ్ పార్టీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. శనివారం అఖిల్ బాబా ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు యువకులు బీఎస్పీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బడుగు బలహీనుల అభ్యున్నతి కోసం కృషి చేసే ఏకైక పార్టీ అని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు బహుజనులంతా ఏకమై బీఎస్పీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దొరశెట్టి సత్యమూర్తి, జిల్లా మైనార్టీ కన్వీనర్ అమ్జద్ అలీ, నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమరవాణాను అరికడదాం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, డీబీ శీతల్

- ఎవరైనా అదృశ్యమైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి
- 1098, 100 నంబర్లకు సైతం ఫోన్ చేయాలి
- సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్

ధారూరు: రోజురోజుకు మనుషుల అక్రమ రావాణా పెరిగిపోతోందని, ముంబయి, గుజరాత్, దుబాయ్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మేస్తున్నారని వికారాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి డీబీ శీతల్ అన్నారు. మండల పరిధిలోని మున్నూరు సోమారం గ్రామంలో శనివారం నిర్వహించిన లీగల్ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. అక్రమ రవాణా అరికట్టడటంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అమ్మాయిలు, యువతులు పాఠశాలలకు, కాలేజీలకు, ఇతర పనుల కోసం బయటకు వెళ్లి తిరిగి రాకుంటే వెంటనే తల్లిదండ్రులు స్పందించాల్సి ఉంటుందని అన్నారు. వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. పోలీసులు సెల్‌ఫోన్ టవర్ ఏరియా ఆధారంగా ఎక్కడున్నది గుర్తిస్తారన్నారు. ఎవరైనా మిస్సింగ్ అయితే వెంటనే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అందరినీ అలర్ట్ చేయాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు.వెంటనే చైల్డ్‌లైన్ 1098కు లేదా 100కు డయల్ చేయడంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ రాము, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

- ఎంపీ రంజిత్‌రెడ్డి
- పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పనుల పరిశీలన
- త్వరలోనే పూర్తవుతాయని వెల్లడి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు త్వరలోనే పూర్తవుతాయని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి శ్రీశైలం బ్యాక్ వాటర్ ప్రాంతమైన నాగర్‌కర్నూలు జిల్లాలోని అనంతగిరి రిజర్వాయర్, ఉద్దండాపూర్ రిజర్వాయ్ వరకు ఉన్న 16 ప్యాకేజీల్లోని కెనాల్స్, టన్నెల్, సర్జిపూల్, పంప్ హౌస్‌లను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే సొంత ఖర్చులతో బస్సులు ఏర్పాటు చేసి చేవెళ్ల ప్రాంతంలోని ప్రజాప్రతినిధులను ప్రాజెక్ట్ సందర్శనకు తీసుకెళ్తామని ప్రకటించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నేతలతో పాటు ప్రాజెక్ట్ ఎస్‌ఈ విజయభాస్కర్‌రెడ్డి, ఇంజనీర్లు ఉన్నారు.



అధికారులు, నాయకులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మృత్యువుతో పోరాడి ఓడిన నితిన్

- తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ మృత్యుఒడిలోకి..
- వైద్యుల నిర్లక్ష్యమే కాటేసిందంటూ తల్లిదండ్రుల రోదనలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన నితిన్‌కుమార్

బషీరాబాద్: వైద్యుల నిర్లక్ష్యం వల్లే మాబాబు బలయ్యాడని, ఆరోజే చికిత్స చేసి ఉంటే బతికేవాడని నితిన్‌కుమార్ తల్లిదండ్రులు తల్లిడిల్లిపోయారు. బషీరాబాద్‌కు చెందిన కదం నితిన్‌కుమార్(17) ఈ నెల 17న పాముకాటుకు గురైన విషయం విదితమే. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండల కేంద్రంలోని మరాఠి గల్లీకి చెందిన కదం కిషన్‌రావు, లక్ష్మీ దంపతుల పెద్ద కొడుకు కదం నితిన్‌కుమార్ ఈ నెల 17న ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబీకులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పాము కాటేసిందని చెప్పినా.. విధుల్లో ఉన్న జగదీశ్వర్ అనే మేల్ స్టాఫ్‌నర్స్ వైద్యం చేయకుండా నిర్లక్ష్యం చేశారు. స్నేక్ బైట్ ఇంజక్షన్ ఉన్నా ఇవ్వలేదు. తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించాలని నిర్లక్ష్యంగా బదులిచ్చారు. వెంటనే వారు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజుల పాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అయితే శరీరంలోని ఆర్గాన్‌లన్నీ దెబ్బతినడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. బషీరాబాద్ పీహెచ్‌సీలో స్నేక్ బైట్ విరుగుడుకు ఇంజక్షన్ ఇచ్చి ఉంటే తమ కొడుకు బతికేవాడని తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేసిన స్టాఫ్‌నర్స్‌ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు స్టాఫ్‌నర్స్ జగదీశ్వర్‌కు మెమో జారీ చేసి, జీతభత్యాలు నిలిపి వేసినట్లు మండల వైద్యాధికారి గోపాల్ తెలిపారు. బాలుడి మృతిపై ఎంపీపీ కరుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాహనం పట్టుబడితే బాదుడే

- ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై నజర్
- రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

తాండూరు: ఎల్లో ప్లేట్ కలిగిన వాహనాలపై రవాణా శాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా.. త్రైమాసిక పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధమైంది. గతంలో ట్రాన్స్‌పోర్టు వాహనాలపై రెండు త్రైమాసికాలకు గాను ప్రభుత్వం పన్ను రద్దు చేసింది. నాటి నుంచి ట్రాన్స్‌పోర్టు వాహనాలు కలిగిన వాహనదారులు ట్యాక్స్‌లు చెల్లించడంలో ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ మరోసారి పన్నులను రద్దు చేస్తుందనే ఆశతో వాహనదారులు ఉన్నారు. కానీ గడువు దాటినా పన్ను చెల్లించడం లేదని అధికారులు వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రవాణాశాఖ ఉన్నతాధికారుల నుంచి మార్చి నెలాఖరులోపు పన్నుల వసూళ్లను పూర్తి చేయాలని ఆదేశాలు అందాయి. జిల్లాలో ఉన్న వాహనాలపై రవాణశాఖ బకాయిల వసూళ్లను ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 1,98,449 వివిధ రకాల వాహనాలున్నాయి. అందులో సరుకు రవాణా చేసే వాహనాలపై ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్డు ట్యాక్స్ వసూలుకు ప్రత్యేక నిఘా ఉంచారు. మరోవైపు అన్ని వాహనాలపై ఫిట్‌నెస్, పర్మిట్, పొల్యూషన్, లైసెన్స్‌లు సరిగా లేకున్న జరిమానా విధించనున్నారు. పన్నులు పెండింగ్‌లో ఉన్న వాహనాలపై ఏకంగా 200 శాతం అపరాధ రుసుము విధిస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,769 ట్యాక్స్‌ప్లేట్ వాహనాలు ఉండగా వాటి ద్వారా ప్రతి మూడు నెలలకోసారి రూ.3.51కోట్ల నిధులు రవాణశాఖను సమకూరుతాయి. ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ.14.4 కోట్ల చొప్పున ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం సమకూరుతోంది.



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ సిబ్బంది

గూడ్స్ వాహనాలు

జిల్లాలో 8వేలకు పైగా గూడ్స్ వాహనాలున్నాయి. కోవిడ్ కారణంగా సరుకు రవాణా చేసే వాహనాలు నెలల తరబడి రోడ్డెక్కలేదు. మరోవైపు రోడ్డు ఎక్కినా ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను నడిపించలేదు. దీంతో రవాణా శాఖకు ప్రతి మూడు నెలలకోసారి చెల్లించాల్సిన రోడ్ ట్యాక్స్ చెల్లించడంలో వాహనదారులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 6 నెలల పాటు మాఫీ చేసింది. వాహనదారులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తే 50 శాతం అపరాధ రుసుములో రాయితీ ఇవ్వనున్నారు. అలా కాకుండా పన్ను చెల్లించకుండా వాహనాలను నడిపిస్తూ పట్టుబడితే 200 శాతం అపరాద రుసుముతో పాటు 300 శాతం పన్ను చెల్లించాల్సి వస్తోందని అధికారులు స్పష్టం చెస్తున్నారు.

స్వచ్ఛందంగా పన్ను చెల్లించాలి



ట్యాక్స్‌ప్లెట్ కలిగిన వాహనదారులు స్వచ్ఛందంగా బకాయి పన్నులు చెల్లించాలి. జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తాం. బకాయి పన్నులతో పాటు అపరాధ రుసుమును 200 శాతం వసూలు చేస్తాం. త్రైమాసిక ట్యాక్స్‌ను వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ విషయం వాహనదారులు గమనించాలి. సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి.

– వెంకట్‌రెడ్డి, డీటీఓ, వికారాబాద్ జిల్లా

క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య దంపతులు

నవాబుపేట: మండల పరిధిలోని చంచల్‌పేట్ గ్రామంలోని ఈదమ్మ ఆలయ 4వ వార్షికోత్సవాలు రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యురాలు జయమ్మ, సర్పంచ్ శ్రీనివాస్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని మాణిక్‌నగర్ పరిధిలో పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్సై, పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ధృవీకరణ పత్రాలు లేని 80 బైకులు, ఆరు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. నేరాల అదుపులో భాగంగా పలు చోట్ల కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. అపరిచిత వ్యక్తులకు ఇళ్ల కిరాయికి ఇచ్చే ముందు వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన ధృవపత్రాలు తీసుకు వచ్చి వారి వాహనాలను తీసుకెళ్లవచ్చన్నారు. లేని ఎడల వాహనాలు సీజ్ చేయనున్నట్లు చెప్పారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

డ్రైవర్లపై కేసు

కుల్కచర్ల: అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శనివారం ఉదయం చౌడాపూర్ మరియు గుబ్బడితండా పరిసర ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు కలప తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతి ప్రతాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు యాదయ్య, రమేశ్ పై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ గిరి తెలిపారు.

పదేళ్లుగా పట్టించుకోవట్లే..!

- గ్రామాల్లో మారని రోడ్ల తీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పల్లెకు బీటీ రోడ్లు వేస్తున్నామని.. కోట్లలో నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నా.. గ్రామాల రోడ్ల దుస్థితి మారలేదు. ఎనిమిదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. సగం వరకు రోడ్ల నిర్మాణం చేపట్టి మిగిలిన పనులు వదిలేస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గుంతలు పడిన రోడ్లపై ఎర్రమట్టి వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.



ఎన్కేపల్లి రోడ్డు దుస్థితి

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లికి అర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కిలోమీటరున్నర దూరం పదేళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. ఎన్కేపల్లి నుంచి సిరిపురం వరకు మూడు కిలోమీటరులు నూతనంగా బీటీ వేసినా ఈ అర కిలోమీటరు అలాగే వదిలేశారు. దీంతో రోడ్లపై కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దుర్గంచెర్వు గ్రామ రోడ్డుపై గుంతలు పడటంతో మట్టి వేసి రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే రామేశ్వరం ఆలయం వరకు అర కిలోమీటరుల చొప్పున వదిలేశారు. ఇలా మండలంలోని ఆయా గ్రామాలకు రెండు కిలోమీటర్ల మేర రీ బీటీ వేసేందుకు నిధులు మంజూరు కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై పలు మార్లు అధికారులకు. ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్లు వేసేందుకు రూ.వందల కోట్లను విడుదల చేస్తున్నామని చెప్పుకొంటున్న ప్రభుత్వం కంకర తేలిన రోడ్లు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఎర్రమట్టి వేసి రాకపోకలు సాగిస్తున్నా వర్షాకాలం, వేసవి కాలంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని ఆందోలన వెళ్లిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వదిలేసిన రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మొరంగపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎన్కేపల్లి వరకు ఉన్న కిలోమీటరున్నర బీటీ రోడ్డు వేశారు. పదేళ్లుగా గడుస్తున్నా మరో అర కిలోమీటరు దూరానికి మోక్షం లభించడం లేదు. ఎన్కేపల్లి నుంచి వీర్లపల్లి మీదుగా సిరిపురం వరకు మూడు కిలోమీటర్లు నూతనంగా బీటీ వేశారు. కానీ ఈ అర కిలోమీటరు రోడ్డు పనులు వదిలేశారు. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం.

– కుమ్మరి ప్రభు, ఎన్కేపల్లి

ప్రతిపాదనలు పంపించాం



మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మిగిలిన రోడ్లకు బీటీ రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గతంలో నిధులు మంజూరైనా ఆ గ్రాంటులో నిధులు విడుదల కావడం లేదని కాంట్రాక్టర్లు పనులకు ముందుకు రాలేదు. ఒక కాంట్రాక్టర్ టెండర్ వేసినా పనులు చేపట్టడం లేదు. ఆ కాంట్రాక్టర్ రద్దుకు సిఫారసు చేశాం. ఆ సగంతో పాటు మొత్తం రీబీటీ కొరకు అనుమతులు రాగానే పనులు చేపడతాం.

– ప్రణీత్ కుమార్, ఏఈఈ పీఆర్, మోమిన్‌పేట

ఆ అడుగుకు 45 ఏళ్లు

- ఎమ్మెల్యేగా రెండు సార్లు హ్యాట్రిక్ మిస్
- వచ్చే ఎన్నికల్లో కుటుంబ సభ్యుల అరంగేట్రానికి గురునాథ్‌రెడ్డి యత్నం



కొడంగల్: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన తర్వాత 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శనివారం నాటికి ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టి 45 ఏళ్లు పూర్తయిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కడప జిల్లా పులివెందుల నుంచి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, చిత్తూరు జిల్లా చంద్రగిరి నుంచి టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కొడంగల్ నుంచి మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి 1978లో ముగ్గురు ఒకేసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. నియోజకవర్గంలో గురునాథ్‌రెడ్డి 30ఏళ్ల పాటు తిరుగులేని నేతగా ఉన్నారు. 2009లో రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి గెలిచిన తర్వాత కొంతమేర ఆయన ప్రభావం తగ్గింది. 2018 శాసనసభ ఎన్నికల తర్వాత ఆయన తన రాజకీయ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురునాథ్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు గెలిచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రికార్డు సృష్టించారు. 1978లో స్వతంత్ర అభ్యర్థిగా, 1983, 1989, 1999, 2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. రెండు సార్లు హాట్రిక్ తప్పింది. 1978, 1983లో వరుసగా విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దీంతో హ్యాట్రిక్ తప్పింది. మరోసారి 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఆయన గెలిచారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇలా రెండు సార్లు ఆయనకు హ్యాట్రిక్ చేజారింది. వచ్చే ఎన్నికల్లో తన కుటుంబ సభ్యులను పోటీ చేయించి గెలిపించాలనే ప్రయత్నంలో ఉన్నారు.

వ్యవస్థలపై అవగాహన తప్పనిసరి

విశ్వసేవక్ సమితి అధ్యక్షురాలు విద్యాభారతి



మాట్లాడుతున్న విద్యాభారతి

కుల్కచర్ల: విద్యార్థులు, బాలికలు అన్ని వ్యవస్థలపైన అవగాహనను పెంపొందించుకోవాలని హైకోర్టు అడ్వకేట్, విశ్వసేవక్ సమితి అధ్యక్షురాలు విద్యాభారతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో 'నవభారత నిర్మాణంలో బాలికల పాత్ర'అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థినులు, బాలికలు సమాజంలో జరుగుతున్న సంఘటనలను నిశితంగా పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ చిన్న అంశాన్ని మానసిక పరిపక్వతతో ఆలోచించడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ఉంటాయన్నారు. మన పద్ధతులు, మన సంస్కృతియే మనకు శ్రీరామ రక్ష అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి దేవి, వీహెచ్‌పీ నేతలు రాజేశ్వర్, చంద్రయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెండెన్స్ నుంచి మినహాయించండి

బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య

వికారాబాద్ అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు జియో అటెండెన్స్ యాప్‌లో హాజరు నమోదు నుంచి మినహాయించాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య కోరారు. శనివారం ఆయన ఆశ వర్కర్లతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడ్మినిస్ట్రేటివ్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల పాటు సేవలు అందించే ఆశలు ఏ టైంమ్‌లో ఎక్కడ ఉంటారో తెలియదన్నారు. అలాంటి వారు సమయానికి హాజరు వేయాలనడం సరికాదన్నారు. హాజరు వేసుకునేందుకు వేచి చూసే సమయంలో గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ఇబ్బంది తలెత్తినా వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతీ రోజు పీహెచ్‌సీలకు, సబ్ సెంటర్లకు వచ్చి హాజరు వేయడం సాధ్యం కాదన్నారు. ఆశ వర్కర్లకు జీతాలు తక్కువగా ఉన్నా పనులు చేయడంలో ముందున్నారనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్ పునరాలోచించి ఆశలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి అనిత తదితరులున్నారు.



కలెక్టర్ కార్యాలయం అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

కేంద్రం నిధులతోనే అభివృద్ధి పనులు

- ధనార్జనే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరు
- బీఆర్‌ఎస్‌పై విరుచుకుపడిన సినీనటి జీవిత



కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న జీవిత

ధారూరు: కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని సినీనటి, అసెంబ్లీ పాలక్ జీవితారాజశేఖర్ విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని హరిదాస్‌పల్లి, దోర్నాల్, ధారూరు, గడ్డమీది గంగారం, కేరెళ్లి గ్రామాల్లో కార్నర్ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండుసార్లు అధికారం చేపట్టి రాష్ట్రాన్ని దోచుకున్న రూ.లక్షల కోట్లతో మూడోసారి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం చేపట్టాలని సీఎం కేసీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ధనార్జనే ధ్యేయంగా కల్వకుంట్ల కుటుంబ శ్రమిస్తోందని ఆరోపించారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చారని.. వచ్చే ఎన్నికల్లో ఓటర్ల డబ్బు ఆశచూపి గెలుస్తామనే భ్రమలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. ధరణి, మాస్టర్ ప్లాన్‌ల పేరిట పేదల భూములు లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులు పెట్టించి ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలమంతా సంఘటితమై బెల్టు షాపులు తొలగించేందుకు ఉద్యమం చేపడతామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రతీ ఒక్కరు బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరారు.

జీపీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబ్బులు ఇవ్వటం లేదు: మాజీమంత్రి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు డబ్బులు ఇవ్వకున్నా, కేంద్ర ప్రభుత్వం ప్రతీ నెల నిధులు విడుదల చేస్తోందని మాజీమంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఇంటింటికి మరుగుదొడ్లు, గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, పేదలకు ఉచిత రేషన్ పంపిణీ చేస్తోందన్నారు. పంచాయతీ భవనాలకు, సీసీ రోడ్లకు, శ్మశాన వాటికల నిర్మాణలకు కేంద్రమే నిధులు కేటాయించిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా బీజేపీ గెలుపుకోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, నెల్లి విశ్వనాథం, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వగృహ భూముల పరిశీలన



రాజీవ్ స్వగృహ భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

వికారాబాద్ అర్బన్: రాజీవ్ స్వగృహ భూములను వేలంలో దక్కించుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందజేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి బిల్లా దాఖల్ భూములను ఆయన పరిశీలించారు. ఆలంపల్లి రెవెన్యూ పరిధిలోని 15 ఎకరాల భూమి వివరాలను ఆర్డీఓ, తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. భూమి కేటాయింపులో ఎలాంటి లిటికేషన్ లేకుండా చూడాలన్నారు. రోడ్లు, ఇతర సౌకర్యాల గురించి రెవెన్యూ, స్వగృహ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విజయ కుమారి, రాజీవ్ స్వగృహ అధికారి నరేందర్ రెడ్డి, తహసీల్దార్ వహీదా ఖతూన్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఆరుగురిపై కేసు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేయాంటి తహసీల్దార్ అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. గౌరెల్లి గ్రామ సర్వేనంబర్ 206లోని ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించారని సర్పంచ్ మల్లేశ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు సదరు భూమిని పరిశీలించగా గ్రామానికి చెందిన ధనుగారి శ్రీనివాస్, శోభ, ధనుగారి ప్రసాద్, పోచగోని వరలక్ష్మి, గణేశ్, కిట్టు గ్రామకంఠం పత్రాలు చూపిస్తూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లు నిర్ధారించారు. వీరు నాటిన రాతి కడీలను తొలగించడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఈ మేరకు కేసు నమోదైంది.

అడ్మిషన్ల గడువు పొడిగింపు

మహేశ్వరం: మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల గడువును మార్చి 1వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బాబు తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఏప్రిల్ 8నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. 16న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

దాడి చేసిన మాలధారులను అరెస్టు చేయండి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

ఆందోళన చేపట్టిన దళిత ప్రజా సంఘాల నాయకులు

తాండూరు టౌన్: యాలాల మండలానికి చెందిన దళిత యువకుడు మెట్లి నరేశ్‌పై దాడికి చేసిన శివ మాలధారులను అరెస్టు చేయాలని దళిత, ప్రజా సంఘాలు శనివారం ఆందోళనకు దిగాయి. స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ధర్నాకు చేపట్టారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. దళితుడిపై దాడికి చేసిన శివస్వాములను అరెస్టు చేసి, దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళితుడిపై స్టేషన్‌లోనే దాడి చేయించిన బీజేపీ నేత మురళీకృష్ణగౌడ్‌ను పరామర్శించడానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, దెబ్బలు తిన్న దళితుడిని పరామర్శించక పోవడం సమంజసం కాదన్నారు. పోలీసులు ఇప్పటికైనా అగ్రవర్ణాలకు తలొగ్గకుండా నరేశ్‌పై దాడి చేసిన 200మంది శివస్వాములను వెంటనే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు మల్కయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, రత్నం, రమేశ్, రవీందర్, బుగ్గప్ప, గోపాల్, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు సంరక్షణ చర్యలు

పెద్దేముల్: 'మొక్కల రక్షణ గాలికి' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఉపాధి హామీ, మండల పరిషత్ అధికారులు అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో హరితహారంపై మాట్లాడారు. నాటిన మొక్కలు పాడైతే పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధి హామీ కూలీల సాయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు నేలకొరిగిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపట్టారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటారు. ఎండిన మొక్కలపై వివరణ ఇవ్వాలని మండల అధికారులకు ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



పెద్దేముల్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొత్త మొక్కలు నాటుతున్న ఉపాధిహామీ కూలీలు

మత్తు కలిపి.. నగలు చోరీ

- కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు
- నిందితుడి అరెస్టు, రిమాండ్
- ఏడు తులాల బంగారు ఆభరణాలు రికవరీ



నిందితుడు పెర్మాల నరహరి

షాద్‌నగర్: పూరీలో మత్తు మందు కలిపి, వాటిని తిన్న మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణాలు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన వేముల శ్రీదేవిని.. మహబూబ్‌నగర్ బీకే కాలనీకి చెందిన పెర్మాల నరహరి.. పెళ్లి సంబంధాల పేరుతో పరిచయం చేసుకున్నాడు. అయితే మీ పిల్లలకు ఘడియలు బాగో లేవని, స్వామీజీ వద్ద పూజలు చేయించాలని మాయమాటలు చెప్పి ఈనెల 8న శ్రీదేవిని కొత్తకోట నుంచి షాద్‌నగర్ పరిధిలోని రామేశ్వరం ఆలయానికి రప్పించాడు. ఆమెకు తెలియకుండా పూరీలో మత్తు మందు కలిపాడు. ఇవి తిన్న శ్రీదేవి నిద్రలోకి జారుకోగానే ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు దొంగిలించి పరారయ్యాడు. కొద్దిసేపటి తర్వాత మత్తునుంచి తేరుకున్న శ్రీదేవి తాను మోసపోయిన విషయాన్ని గుర్తించి వెంటనే షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీ, ఫోన్ నంబర్ ఆధారంగా నిందితుడిని గుర్తించి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు గతంలోనూ నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెర్వుగట్టు జాతరలో కూడా ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు నగలు దోచినట్లు తెలిపారు. రెండు కేసులకు సంబంధించిన ఆభరణాలను రికవరీ చేశామన్నారు. ఏసీపీ కుషాల్కర్ పర్యవేక్షణలో సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ చంద్రశేఖర్, క్రైం సిబ్బంది జాకీర్, రవి, యాదగిరి, మోహన్, రాజు, రఫీ కేసును ఛేదించారు.

భిక్షాటన చేస్తున్న మహిళ మృతి

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని వెంచర్‌లో శనివారం మధ్యాహ్నం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం హర్షగూడతండాకు చెందిన సంగీత(30)కు పదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలతో ఇద్దరూ విడిపోయారు. కొంత కాలం క్రితం జరిగిన ప్రమాదంలో భర్త మృతిచెందగా.. సంగీత భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురైంది. ఈ క్రమంలో శనివారం ఆమె మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె సోదరుడు మేఘావత్ దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం



ఉపాధ్యాయులతో పీఆర్టీయూ నాయకులు

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు

పెద్దేముల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని మంబాపూర్, కందనెల్లి, మారేపల్లి, ఇందూరు, పెద్దేముల్ ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటిప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. 317 జీఓలో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వంతో పోరాడుతున్నామని గుర్తుచేశారు. సీపీఎస్ ఉపాధ్యాయులకు ఫ్యామిలీ పెన్షన్, కేజీబీవీ ఉపాధ్యాయులకు వేతనంతో పాటుగా మెటర్నిటీ సెలవులు, వాంటమా పెన్షన్ విషయంలో సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య, గోబ్రానాయక్, ద్యావరి నరేందర్‌రెడ్డి, మల్లమ్మ, శాంతప్ప, శ్రీనివాస్, ఆనంద్, బంద్యప్ప తదితరులు పాల్గొన్నారు.